RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 225 | ఆగస్టు 03, 2025 | వెల : రూ.3-00



**పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి**

2లో..

- మడికొండలో 'రియల్' మాఫియా ఆగడాలు..!?
- కాలువ ఆనవాళ్లు లేకుండా మొరంతో నింపిన వైనం
- తమ పొలాలకు నీళ్లు ఎలా? అని రైతుల ఆవేదన
- ఆఫీసర్లు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



## పెద్ద చెరువు పూడ్చేశారు.!

**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం మడికొండలో భూమాఫియా కోరలు చాస్తోంది. మడికొండ పెద్ద చెరువు కాలువను పూడ్చి ఏకంగా మొరంతో నింపి వేశారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు పెద్ద చెరువు కాలువను పూడ్చి వేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రైతులు శనివారం అక్కడకి వెళ్లి గుమస్తాను అడగ్గా, సమాధానం ఇవ్వకుండా దాటవేత ధోరణిలో మాట్లాడి అక్కడి నుండి వెళ్లిపోయారని రైతులు తెలిపారు. కాగా, ఈ కాల్వ పూడ్చడంతో దాదాపు రైతులందరి పొలాలకు నీరు వెళ్లకుండా నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులు చొరవ తీసుకొని యథావిధిగా కాలువ ఉండేట్టు తగు చర్యలు చేపట్టాలని ఫార్మర్స్ వేడుకుంటున్నారు.



## యువకుడి వింత చేష్టలు

- స్కూటీపై నిలబడి ఫోజులు
- పొంచిన ప్రమాదంపై పట్టింపు లేదా?

**వేద న్యూస్, వరంగల్:**

రోడ్డు మీద వాహనాలు నడిపే క్రమంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని అధికారులు పేర్కొంటున్నారు. కానీ, కొందరు యువకులు అయితే ఇష్టారాజ్యంగా రోడ్లపై వింత, విచిత్ర చేష్టలతో ప్రజలను భయభ్రాంతలకు గురి చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని ఉర్సుగుట్ట సమీపంలో రహదారిపై ఓ యువకుడు స్కూటీపై వింత పోకడలు పోయాడు. ఇందుకు సంబంధించిన చిత్రం 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక కెమెరాకు చిక్కింది. రోడ్డుపై అది కూడా మూలమలుపు వద్ద ద్విచక్రవాహనంపై నిలబడి మరీ ఫోజులు ఇచ్చాడు. అది చూసి స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అపోజిట్‌లో హెవీ వెహికల్స్ వస్తే ఎలా? అని అడిగారు. యువకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా ద్విచక్రవాహనాలపై రోడ్డుపై వెళ్లే క్రమంలో తమ ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాల సంరక్షణకు జాగ్రత్త వహించాలని నగరవాసులు సూచిస్తున్నారు. రోడ్లపై పొంచిన ప్రమాదాలపై పట్టింపు లేకుండా వాహనదారులు వ్యవహరించడం సరికాదని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు.


## బట్టలబజార్ బ్రిడ్జి గుంతలమయం

- ఫ్లై ఓవర్‌పై ప్రయాణం ప్రమాదకరం - ఇబ్బందులు పడుతున్న వాహనదారులు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**వేద న్యూస్, ఓరుగల్లు:**

గ్రేటర్ వరంగల్ నగరంలోని బట్టలబజార్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు, నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఓ వైపు భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో.. రోజువారీ విధుల నిర్వహణ, పనుల కోసం బట్టలబజార్ ఫ్లైఓవర్‌పై నుంచి ప్రయాణం చేయాలంటే జంకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వివరిస్తున్నారు. బ్రిడ్జి మొత్తంగా గుంతలమయంగా మారిందని, జల్లెడలా గుంతలు మారాయని ప్రజలు పేర్కొంటున్నారు. పాట్ హెూల్స్ రిపేర్ కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నట్టు పేర్కొంటున్నదని, కానీ,





వరంగల్ బట్టలబజార్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపైన రోడ్డు మీద గుంతలు పూడ్చడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చొరవ చూపి.. బ్రిడ్జిపైన రోడ్డు మీదున్న గుంతలు పూడ్చాలని, లేదంటే సమీప భవిష్యత్తులోనే బట్టలబజార్ పైన ప్రయాణం చాలా నరకయాతనగా మారుతుందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు రిపేర్‌పై దృష్టి సారించాలని రిక్వెస్టు చేస్తున్నారు.

## నత్తనడకన అభివృద్ధి పనులు

- తగ్గిన అధికార పార్టీ జోరు - బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ విమర్శ

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



ఎల్కతుర్తి మండల పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఇలానే వర్క్స్ కొనసాగితే అభివృద్ధి ప్రజలకు అందని ద్రాక్షగానే ఉంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ విమర్శించారు. శనివారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హస్తం పార్టీ జోరు తగ్గిందని ఆరోపించారు. మండలకేంద్రంలో కూడలి నిర్మాణ పనుల వేగం తగ్గిందని, సుందరీకరణ పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. మూడు జిల్లాలను కలిపే నడి చౌరస్తాలో కారు చీకట్లు కమ్ముకున్నాయని వెల్లడించారు. హైమాక్స్ లైట్స్ ఏర్పాటు చేసి ప్రారంభానికి నోచని దుస్థితి నెలకొందని వివరించారు. చిమ్మ చికట్లో మండల ప్రజలు నాన ఇక్కట్లు పడుతున్నారని, కనీసం ఆర్టీసీ వాళ్లు గమ్యాన్ని చూపే దిక్సూచీలను ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగా ఈ దారిలో వచ్చేవాళ్లు గమ్యం ఎటు వైపునకు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నారని స్పష్టం చేశారు. సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో ఇంకా జాప్యం ఎందుకు జరుగుతున్నదని ప్రశ్నించారు. డ్రైనేజీలు తీసే క్రమంలో ధ్వంసమైన మంచినీటిని సప్లయ్ చేసే పైపులు పగిలి ఎల్కతుర్తి గ్రామ ప్రజలు తాగునీటి కొరత ఎదుర్కొంటున్నారని వివరించారు.

– ట్రిపుల్ ఐటీ సంగతి మరిచారా?

త్రిపుల్ ఐటీ మడిపల్లె దారిలో ఉన్న అసైన్ భూములను సర్వే చేశారని, దాని కోసం కలెక్టర్, ఎమ్మెల్యే సీసీ వచ్చి సర్వే చేసి భూసేకరణ చేసి దాదాపు 4 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ విద్యాసంస్థ ఊసే లేదని తెలిపారు. అసలు ట్రిపుల్ ఐటీ ఎల్కతుర్తి మండలానికి వస్తుందా? లేదా? అని అడిగారు. చింతలపల్లి గ్రామ ప్రజలు ట్రిపుల్ ఐటీ మీద ఎన్నో ఆశలు పెట్టుకొని, పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని, వాళ్లకు పని ఉపాధి కలుగుతుందని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారని వివరించారు. సదరు విద్యా సంస్థ విషయంలో ఎందుకు జాప్యం జరుగుతున్నదని ప్రశ్నించారు. విద్యా సంస్థ ఇంకెక్కడికైనా తరలివెళ్లిందా? మండలం నుంచి దానిని ఎక్కడికి తరలించారు? అని అడిగారు. రాజీవ్ యువ వికాసం సంగతి మరిచారా? అని ధ్వజమెత్తారు. ఆర్టీసీ బస్టాండ్ ముందు ఉన్న చిరు వ్యాపారులకు కాంప్లెక్స్ కట్టిస్తామన్న మాట

మిగతా 4వ పేజీలో..

## రాష్ట్రంలో డిగ్రీ ఉన్నట్లా.. లేనట్లా?

- ఎస్‌ఎఫ్‌ఐ నిరవధిక దీక్షలకు దాలి నాయుడు సంఘీభావం

**వేద న్యూస్, పార్వతీపురం:**



రాష్ట్రంలో డిగ్రీ ఉన్నట్లా...? లేనట్లా...? అని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఓబిసి జిల్లా చైర్మన్, పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు ప్రశ్నించారు. శనివారం పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వారణాసి శ్రీహరి, చుక్క చంద్రరావు తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న నిరవధిక దీక్షలకు సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫలితాలు ప్రకటించి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు రాష్ట్రంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు లేకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం డిగ్రీ విద్యను మరిచిపోయిందేమోనని ఎద్దేవా చేశారు. అలాగే విద్యార్థులకు ఇబ్బంది కలిగించే సెమిస్టర్ విధానం, మేజర్, మైనర్ విధానాన్ని అమలు చేయటం బాధాకరమన్నారు. జిల్లాలో పీజీ కోర్సుల లేక విద్యార్థులు విశాఖ, విజయనగరం తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీంతో సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు డిగ్రీ తర్వాత తమ భవిష్యత్తు చదువుకు స్వస్తి చెప్పే పరిస్థితి అధికంగా ఉందన్నారు. జిల్లా ఏర్పడ్డాకైనా పీజీ సెంటర్ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 6,400 కోట్ల బకాయి ఫీజు రీయింబర్స్మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆఫ్లైన్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలన్నారు. సింగిల్ సబ్జెక్టు స్థానంలో డ్యూయల్ మేజర్ సబ్జెక్టు విధానం ప్రవేశపెట్టాలన్నారు. పార్వతీపురం పాలకొండ గుమ్మలక్ష్మీపురం కేంద్రాల్లో పిజి సెంటర్లు ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న భవనాల వసతి, మెనూ, వైద్య సదుపాయాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల కొరత తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారమయ్యేంతవరకు విద్యార్థులకు, విద్యార్థి సంఘం ఎస్‌ఎఫ్‌ఐ కు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- ఏడవ కేంద్ర వేతన కమిషన్ ప్రకారం వేతన సవరణ చేయాలి
- డి ఏ బకాయిలను వెంటనే చెల్లించాలి
- ఏ ఐ యు ఈ సి జాతీయ ఉపాధ్యక్షులు పుల్లా శ్రీనివాస్




**వేద న్యూస్, డెస్క్:**

న్యూఢిల్లీలోని బి టి ఆర్ భవన్ లో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ కాన్ ఫేడరేషన్ జాతీయ అధ్యక్షులు బిఎస్ హెూటా అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ విశ్వవిద్యాలయ సిబ్బంది ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేయబడిన వివిధ సమస్యలపై జాతీయ ఉపాధ్యక్షులు అయినటువంటి పుల్లా శ్రీనివాస్ సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏడవ కేంద్ర వేతన కమిషన్ ప్రకారం వేతనాలు అమలులో ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయ ఉద్యోగులకు పాత వేతనాలు మాత్రమే ఇస్తున్నారని, ఇది ఉద్యోగులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయడంతో పాటుగా వారి గౌరవాన్ని కూడా కించపరుస్తుందని, తెలంగాణ ప్రభుత్వం డియర్ నెస్ అలవెన్స్ ప్రస్తుతం వరకు ఐదు బాకీ ఉన్నప్పటికీ రెండింటిని ఆమోదించి ఒకటి మాత్రమే ఇచ్చిందనీ మిగతా డి ఏ లను కూడా వెంటనే ఇవ్వాలన్నారు. అనేకమంది రిటైర్డ్ ఉద్యోగులు తమ పెన్షన్లు ఇతర హక్కుల గురించి నెలల తరబడి వేచి ఉండే పరిస్థితి నెలకొందని, రిటర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించబడక వారు అనర్హతకు గురవుతున్నారని, తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల అర్హతలకు వారు నిర్వర్తించే బాధ్యతలకు సంబంధం లేకుండా ఉందని, వారి అర్హతకు వారి బాధ్యత ప్రతిబింబించట్లేదని, వేతనం విషయంలో అసమానతలు ఉండి ఉద్యోగులు అసంతృప్తి చెందుతున్నారని, యూనివర్సిటీలో బోధన, బోధనేతర పోస్టులు అనేకం ఖాళీగా ఉన్నాయని అందువల్ల ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందిపై పని భారం అధికంగా పడుతుందనీ, అది విద్య నాణ్యతను దెబ్బతీస్తుందని, అలాగే తెలంగాణ విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ అధికారుల ఆధీనంలో ఉన్నాయని, ఇది అకాడమిక్ స్వేచ్ఛను అడ్డుకుంటుందని, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అధికారం లేకుండా పోయిందని తెలిపారు.

వేతన కమిషన్ సిఫారసులకు అనుగుణంగా సమగ్ర వేతన సవరణను చేసి వెంటనే అమలుపరచాలని, బకాయి ఉన్న డియర్ నెస్ అలవెన్స్ రాయితీలను అన్నిటిని వెంటనే విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించాలని, విశ్వవిద్యాలయ పోస్టులలో వేతన స్కీమ్స్ ఏకరూపీకరణ చేయాలని, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని పునరుద్ధరించి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉండేలాగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ కాన్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు పుల్లా శ్రీనివాస్ కోరారు. విశ్వవిద్యాలయాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు, వారి హక్కుల కొరకు ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని, ఐక్యంగా పోరాడినప్పుడే మన సమస్యలు పరిష్కరించబడతాయని మన హక్కులను మనం సాధించుకోగలుగుతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



# డిజిటల్ విద్యకు శ్రీకారం

## - ఎంజేపీలో ప్రారంభించిన ప్రభుత్వ విప్ శ్రీనివాస్

**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాల-కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ డిజిటల్ విద్యా కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీట్ మెడిసిన్, ఐఐటీ ఫౌండేషన్, జేఈఈ కోర్సులకు ఉచితంగా శిక్షణ తరగతులు అందించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను స్వయంగా చూసుకుంటూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే దృష్టితో అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. జిల్లాలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రత్యేక రూపకల్పనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారని, మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో అన్ని పాఠశాలలకు ఇది విస్తరించబడుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ శిక్షణలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల విద్యావేత్తలు, శిక్షకులు విద్యార్థులకు బోధన అందించనున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థులను భవిష్యత్తు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారికత కేంద్రం కోఆర్డినేటర్ రోజా, మార్కెట్ కమిటీ చైర్మన్ రోడ్డి రాజు, ప్రిన్సిపాల్ శ్యామల, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నత్తనడకన అభివృద్ధి పనులు

ఇప్పటివరకు నెరవేరలేదని చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఆ బాధ్యతలను బీజేపీ తరఫున తాము గుర్తు చేస్తున్నామని వెల్లడించారు. అధికార పార్టీ నేతలు పైరవీలు మాని ప్రజాపాలన అభివృద్ధి ఫలాలను ప్రజలందరికీ అందేలా చూడాలని సూచించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గళంగా ఉంటామని భవిష్యత్తులో ప్రజల గొంతుగా నినదిస్తామని, వారి అభివృద్ధి కోసం పోరాటాలు చేస్తామని శ్రీకాంత్ వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆడెపు శ్రీ వర్ధన్, కోడం రమేష్, మాజీ సర్పంచ్ కుడితాడి రాజు, సుకినె సుధాకర్‌రావు, శ్యాంసింగ్, సల్పాల కిరణ్, దేవరావు, తిరుపతి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ‘పత్తి’లో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని హుస్సేన్ పల్లి గ్రామంలో శనివారం ప్రజ్వల్ ఫీల్డ్ ఫెసిలిటేటర్ కార్యకర్త పోరండ్ల భానుమతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ అధికారి గంగా జమున హాజరై మాట్లాడారు. పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించి నాణ్యమైన దిగడులు సాధించాలన్నారు. సమగ్ర సస్యరక్షణలో భాగంగా రైతులందరూ పత్తి పంటలో అంతర పంటలు ,రక్షక పంటలు వేయాలి . రసం పీల్చు పురుగు నివారణకు జిగురు అట్టలు కాయతోలుచు పురుగు ఉనికి తెలుసుకోవడానికి లింగాకర్షక బుట్టలు లాంటివి ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. రసం పీల్చుపురుగు అయినటువంటి పె నుబంక ,పచ్చ దోమ ,తామర పురుగు నివారణకు వావిలా కషాయం,వేప గింజల కషాయం లాంటివి పిచికారి చేయాలని అవగాహన కల్పించారు. కాండానికి బొట్టు పెట్టే పద్ధతి పాటించాలన్నారు. రైతులు ఎచ్ పి పి అత్యధిక విషపూరిత పురుగుమందులకు మోనోక్రోటోపాస్ లాంటి వాటికిబదులుగా వావిలాకు కషాయం, వేప గింజల కాషాయం లాంటివి పిచికారి చేయాలని వెల్లడించారు. పురుగు మందులు పిచికారి చేసే సమయంలో రైతులందరూ పి పి పి ఇ వ్యక్తిగత రక్షణ దుస్తులు ధరించాలని స్పష్టం చేశారు. .అనంతరం గ్రామంలోని ఎనిమిది మంది రైతుల ఫీల్డు విజిట్ చేశారు . రసం పీల్చు పురుగు నివారణకు కాండానికి బొట్టు పెట్టే పద్ధతి గుండెకారి శ్రీనివాసు ఫీల్డ్ లో డెమోన్స్ స్టేషన్ చేశారు . ఫీల్డ్ ఫెసిలిటేటర్ పోరండ్ల భానుమతి ఆధ్వర్యంలో రైతులకు జిగురు అట్టలు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలిటేటర్ పోరాండ్ల భానుమతి , హుస్సేన్ పల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నల్లబెల్లి ఎంపీడీవోగా
# రవి బాధ్యతల స్వీకరణ

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) పసరగొండ రవి శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పసరగొండ రవిని కార్యాలయ సిబ్బంది ఘనంగా అభినందించారు. సూపరింటెండెంట్ ఎండీ. అభిద్ అలీ, సీనియర్ అసిస్టెంట్ శారదా, శైలేజా, పరం జ్యోతి, గంగాధర్, రఘువరన్ తదితరులు ఆయనకు పూలమాలలతో స్వాగతం పలికారు. దీర్ఘకాలంగా మంచి పరిపాలన కొనసాగిస్తున్న ఆయనకు ఎంపీడీవోగా పదోన్నతి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. తనకు ఇవ్వబడిన కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు. మండల అభివృద్ధిలో భాగస్వామిగా మారేందుకు కృషి చేస్తానని, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో స్పందిస్తూ, స్థానిక సంస్థల పరిపాలనను మరింత బలోపేతం చేస్తానని వెల్లడించారు.

# ముగిసిన ఎన్‌సీసీ యాన్యువల్ క్యాంప్

**వేద న్యూస్, హన్మకొండ:**



కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్సీసీ పదో తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో కంబ్యాండ్ యాన్యువల్ ట్రైనింగ్ పది రోజుల క్యాంపు 24 జూలై నుండి ఆగస్టు 2 వరకు నిర్వహించగా, 759 మంది ఉమ్మడి ఖమ్మం ,ఉమ్మడి వరంగల్ జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ రాష్ట్రాల నుండి పాల్గొన్నారని కల్నల్ ఎస్ ఎస్ రామదురై తెలిపారు. రిపబ్లిక్ డే 2026 ఢిల్లీలో పాల్గొనే ఎన్ సి సి కడెట్స్ ఎంపిక, ప్రైమరీ స్థాయిలో పూర్తయిందని, ఇందులో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు . క్యాంపులో మ్యాప్ రీడింగ్, ఆర్మీ హిస్టరీ, పర్సనాలిటీ డెవలప్మెంట్, లీడర్షిప్ క్వాలిటీస్ ,క్రీడా నైపుణ్యం, ఫైరింగ్ వంటి అంశాలపై ఎక్స్పర్ట్ చే శిక్షణ, ఖమ్మం, వరంగల్ వివిధ బెటాలియన్ల అధికారులు బెస్ట్ కాడేట్స్, డ్రిల్లు, సంస్కృతిక విభాగాలలో నిష్ణార్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ క్యాంపు క్యాడే ట్స్ జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకోవడానికి ఎంతో దోహదపడుతుందని క్రమశిక్షణతో, పట్టుదలతో, వ్యక్తిత్వ వికాసంతో ,మంచి నాయకత్వ లక్షణాలు కలిగి పటిష్టమైన ఆరోగ్యంగా ఉన్న ,శరీర దారుఢ్యం, అంకిత భావంతో ఉన్న పట్టుదలకు లక్ష చేదనలో సక్సెస్ కాడేట్స్ను గుర్తించి ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు రామదురై వివరించారు. ఈ క్యాంపునకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి, రిజిస్టర్ ప్రొఫెసర్ రామచందర్ సార్ , ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి మనోహర్, స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య, డెవలప్మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ వాగ్దేవి రెడ్డి,హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్ కుమార్ క్యాంపు కు సహకరించిన, అసిస్టెంట్ రిజిస్టర్ డాక్టర్ పృథ్వి వల్లాల, యూనివర్సిటీ అధికారులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ ఎస్ రామదురై తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, కెప్టెన్ డాక్టర్ పి సతీష్ , కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయినిని కలిసిన భద్రకాళి దేవస్థాన అర్చకులు

**వేద న్యూస్, హన్మకొండ:**



భద్రకాళి దేవస్థానం ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దేవస్థాన వంశపారంపర అర్చకులు బండారి శేషయ్య, ఆలయం చైర్మన్, ట్రస్ట్ డైరెక్టర్స్ సమక్షంలో ఎమ్మెల్యే కు వినతి పత్రం ఇచ్చారు. సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు అర్చకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, దేవస్థాన అర్చకులు సిబ్బంది సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరలో పరిష్కారానికి కృషి చేస్తానని నాయిని హామీ ఇచ్చినట్టు వెల్లడించారు. దేవస్థానం మాడవీధుల నిర్మాణ పనులను శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చిన ట్రస్ట్ బోర్డ్ సభ్యులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# ‘మున్సిపల్’లో నిధుల గోల్‌మాల్

- అవినీతి అడ్డాగా కార్పొరేషన్
- కలెక్షన్ కింగ్స్‌గా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు
- అనుమతుల కోసం ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోం
- మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ సంచలన ఆరోపణలు



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ మాజీ మేయర్ , తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ శనివారం పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలోని ఎల్ఆర్ఎస్ నిధుల దుర్వినియోగం ,అధికారుల అవినీతి పై ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా రాష్ట్ర ప్రజలను , కరీంనగర్ ప్రజలను మోసం చేసి డబ్బు వసూళ్లకు కుట్రలకు పాల్పడుతుందని, జిల్లాలో ఎల్ఆర్ఎస్ కు దాదాపుగా 39వేలకు పైగా దరఖాస్తు చేసుకున్నారనీ,దీంట్లో 24వేల మందికి మున్సిపల్ అధికారులు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపించారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 8వేలకు పైగా ఫీజులు చెల్లిస్తే కేవలం 4వేల దరఖాస్తులకు మాత్రమే ప్రొసిడింగ్ పత్రాలు ఇవ్వడం ఏమిటని? ప్రశ్నించారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ కు ప్రజలు 40 కోట్ల 69 లక్షలు రూపాయలు అందించారు కానీ, చెల్లించిన నిధులు మున్సిపల్ కార్పొరేషన్ అకౌంట్లో జమ చేయలేదని ఆరోపించారు. నగర ప్రజలు రాత్రి, పగలు ఎంతో కష్టపడిన సొమ్మును ఎల్ఆర్ఎస్ కు చెల్లిస్తే,మున్సిపల్ కార్పొరేషన్ లో కాకుండా రాష్ట్ర ప్రభుత్వ అకౌంట్లో నిధులు మళ్లించడం ఏమిటని? ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా మండిపడినారు.జిల్లా కలెక్టర్ కు, మున్సిపల్ కమిషనర్ లకు ఎన్నోసార్లు కలిసి జిల్లాలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై, నిధుల మళ్లింపు పై ఫిర్యాదులు చేసినా, కేసులు పెట్టిన కూడా ఇప్పటికీ పట్టించుకోలేదని వారు వాపోయారు.జిల్లాలోని టౌన్ ప్లానింగ్ అధికారులు “కలెక్షన్ కింగ్స్” గా మారారని తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండకుండా, హెూటలల్లో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**త్వరలో ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెప్తారు**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న అక్రమాలపై త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని , రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ అవినీతి నిరంకుశ పాలనకు చరమగీతం పాడుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లాలో నిధుల పట్ల గోల్మాల్ జరుగుతున్న కూడా ఏ ఒక్క మంత్రి అయినా నగర ప్రజల కష్టాలను గాని, అవినీతిపై గానీ రివ్యూ చేయలేదని, రివ్యూ మీటింగ్ కూడా నిర్వహించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. నగరంలో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ ఏసీబీ విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లు ప్రత్యక్షంగా జిల్లా నగర పాలక సంస్థలో పర్మిషన్లకు స్వయంగా పాల్గొని అవినీతి భరతం పట్టాలని కోరారు.

# రైతు గెలుపు బాబు సంకల్పం

**వేద న్యూస్, పార్వతీపురం మన్నెం జిల్లా:**

**- ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర**

రైతు గెలవాలి.. వ్యవసాయం నిలవాలనేది తెలుగుదేశం ప్రభుత్వం నినాదం, ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర స్పష్టం చేశారు. సీతానగరం మండలం గుచ్చిమి గ్రామంలో అన్నదాత సుఖీభవ రైతు సదస్సులో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద పార్వతీపురం నియోజకవర్గంలో రైతులకు 18 కోట్ల ఆరు లక్షల మొత్తం విడుదల కావడంతో రైతులు సంబరాలు చేసుకున్నారు. రైతులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే విజయ్ చంద్ర క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రైతులకు ఏడాదికి 20,000 అన్నదాత సుఖీభవ సాయం, ఇప్పుడు 7000 అక్టోబర్లో మరో 7000 జనవరిలో 6000 చొప్పున కేంద్ర ప్రభుత్వంతో కలిపి అందిస్తున్నామని కౌలు రైతులకు కూడా రెండు విడతల్లో 20000 మొత్తం జమ చేస్తారని వెల్లడించారు. రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబుకు రైతుల కష్టాలు తెలుసునని, అందుకే పెద్ద మొత్తంలో సాయం అందిస్తున్నారని తెలిపారు. అలాగే ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతులు ఖాతాలలో డబ్బులు చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెరువులు గడ్డలు, వాగులను బాగు చేయడంతో పాటు సాగునీటి పథకాలను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని చెరువులను గాలికి వదిలేసిందని విమర్శించారు ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్వతీపురం నియోజకవర్గానికి వచ్చి సాగునీటి పథకాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారని వెల్లడించారు. చంద్రబాబు హామీ ఇస్తే ఎంత కష్టమైనా తప్పకుండా నెరవేరుస్తారని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లోనూ రైతులకు అండగా నిలుస్తున్న కూటమి



ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోఐటీడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ స్కీం ప్రారంభం

**వేద న్యూస్, పార్వతిపురం మన్యం జిల్లా:**

కురుపాం నియోజకవర్గ కేంద్రంలో శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ టి. జగదీశ్వరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పియం కిసాన్ పథకం ద్వారా రైతులకు 2025-26 సంవత్సరానికి మొదట విడతగా రైతులకు వారి ఖాతాలో 7000 జమ చేస్తామని తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ 6 వేలు, స్టేట్ గవర్నమెంట్ 14 వేలు కలిపి 3 విడతల కింద సంవత్సరానికి 20,000 రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అందించే పలు పథకాలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ కద్రక కళావతి, వైస్ చైర్మన్ గౌరీ శంకర్, ప్రత్యేక అధికారి ధర్మచంద్రారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో సరికొత్త స్పోర్ట్స్ పాలసీ..

**వేదన్యూస్ డెస్క్:**

లెటజ్ స్టార్ట్ ది గేమ్ అంటోంది తెలంగాణలో రేవంత్ సర్కార్.. పాత క్రీడావిధానాన్ని సమూలంగా మార్చి.. సరికొత్త స్పోర్ట్స్ పాలసీతో దూసుకెళ్తోంది. హైదరాబాద్ వేదికగా జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ ఫస్ట్ ఎడిషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నూతన క్రీడా విధానం ఆవిష్కృతమైంది. ఒలింపిక్ పతకాలే మన పాలసీ లక్ష్యమని, ఆ విధంగా తెలంగాణ సర్కార్ దేశానికే ఆదర్శంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. యువత క్రీడామైదానాల్లో లేకపోవడంతో దేశం చాలా నష్టపోతోందన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియమ్‌ను ప్రస్తావించారు. ఉద్యమంలో ముందుభాగంలో నిలబడి పోరాడిన యువత.. గత ప్రభుత్వ విధానాలు సరిగా లేకపోవడం వల్ల వ్యసనాల బారిన పడిందని ప్రభుత్వం భావిస్తోంది. యువతీయువకుల్లోని బలమైన పోరాట స్ఫూర్తిని క్రీడల వైపు మళ్లించాలన్నది సర్కార్ ఆలోచన. క్రీడా విధానంలో రాజకీయాల జోక్యాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో పబ్లిక్, ప్రైవేట్ ఉమ్మడి భాగస్వామ్యంతో కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించారు. కార్పొరేట్ కంపెనీల్లో సక్సెస్ స్టోరీ ఉన్నవాళ్లు, క్రీడల్లో రాణించి పతకాలు తెచ్చి దేశానికి గర్వకారణంగా నిలబడ్డవాళ్లు పాలసీలో కీలకంగా మారబోతున్నారు. చదువుల్లోనే కాదు, క్రీడల్లో రాణించేవాళ్లకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలబడుతుందని, అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, రవికాంత్, సిరాజుద్దీన్, నికత్ జరీన్ లాంటి స్పోర్ట్స్ స్టార్ల అనుభవాన్ని ఉపయోగించుకుంటామని చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి.







# భద్రకాళి దేవస్థానంలో నిత్య అన్నదానం

**వేద న్యూస్, వరంగల్:**

భద్రకాళి దేవస్థానంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుమారుగా ప్రతిరోజూ 300 మందికి, ప్రతి శని,ఆదివారాల్లో 500 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు జిల్లా మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయుని రాజేందర్ రెడ్డి, ఆలయ ఈవో కు భద్రకాళి దేవస్థానం డైరెక్టర్లు శనివారం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేవస్థానానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులందరికీ అమ్మవారి ప్రసాదం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. అన్నదాన కార్యక్రమంలో భద్రకాళీ ఆలయ డైరెక్టర్లు గాదే శ్రావణ్ రెడ్డి, జారతి వెంకటేశ్వర్లు, ఓరుగంటి పూర్ణ, మోత్కూరి మయూరి రాము, పాలడుగుల ఆంజనేయులు,అనంతుల శ్రీనివాస్ దేవస్థాన ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 8 వారాల్లో చర్యలు తీసుకోండి

- ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో బాలుడికి నిర్లక్ష్య వైద్యం ఘటనలో..
- బాధితుడికి ఆస్పత్రిపై తీసుకున్న యాక్షన్ సమాచారం ఇవ్వండి
- హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రెటరీకి ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశాలు

**వేద న్యూస్, వరంగల్:**

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) హనుమకొండ బాలసముద్రంలోని ఓ ఆస్పత్రిలో జరిగిన నిర్లక్ష్య వైద్య ఘటనపై స్పందించింది. బాధితులు ఎన్‌హెచ్ఆర్‌సీకి ఈ ఏడాది మార్చి 3న ఫిర్యాదు చేయగా, కమిషన్ లా విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అతుల్ కుమార్ స్పందించారు. సదరు ఘటనపై ఎంక్వయిరీ జరిపి, తగు చర్యలు 8 వారాల్లో తీసుకోవాలని, యాక్షన్ తీసుకున్న సమాచారాన్ని బాధితులకు తెలియజేయాలని రాష్ట్ర హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రెటరీని కమిషన్ ఆదేశించింది. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గురజాల గ్రామానికి చెందిన బాధితులు కొక్కు సదానందం-సునీత తెలిపిన వివరాల ప్రకారం.. వారి కుమారుడైన తనీష్‌ను 2023 ఆగస్టు 5న హనుమకొండ బాలసముద్రంలోని శ్రీ ఉదయ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అపెండిస్ ఆపరేషన్ చేయించారు. కాగా, ఆ వైద్యం వికటించిందని, బాలుడికి తర్వాత అనారోగ్య సమస్యలు తలెత్తాయి. డాక్టర్‌ను సంప్రదిస్తే.. పెద్దాస్పత్రికి తరలించాలని చెప్పారు. దాంతో తనీష్ కుటుంబీకులు యశోద ఆస్పత్రికి తరలించగా, అక్కడ వైద్యులు ముందుచేసిన సర్జరీ వికటించిందని తెలిపి, మళ్లీ అక్కడ ట్రీట్ మెంట్ చేయగా, భారీగా ఖర్చు అయింది. శ్రీఉదయ్ ఆస్పత్రిలో డాక్టర్ నిర్లక్ష్యంపై బాధితులు పోరాటం చేస్తున్నారు. సదరు హాస్పిటల్ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌హెచ్ఆర్‌సీకి సైతం కంప్లయింట్ చేయగా, తాజాగా కమిషన్ సైతం స్పందించి.. తెలంగాణ రాష్ట్ర హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రెటరీకి ఆదేశాలు జారీ చేసింది.

# పురుగుల మందుతాగి మహిళా కానిస్టేబుల్ సూసైడ్!

**వేదన్యూస్ డెస్క్:**

సాధారణంగా ప్రజలకు కష్టాలు వస్తే పోలీసుల దగ్గరకు వెళ్తారు.. కానీ ఆ పోలీసులకే కష్టం వస్తే వాళ్లు ఎవరకి చెప్పుకుంటూరు. కొందరు సమస్య తీవ్రతను బట్టి తెగించి పోరాడుతారు. ఉన్నాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకుంటారు. కానీ మరికొందరు ఆ సమస్యలను ఎదుర్కొలేకా ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. తాజాగా రాచకొండ పీఎస్ పరిధిలోనూ ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. ఒక మహిళా కానిస్టేబుల్ కుటుంబ కలహాలతో ఇంట్లో పరుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఘటననపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 బ్యాచ్‌కు చెందిన (28) మనీషా గత ఐదేళ్లుగా మీర్పేట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో వారం రోజుల క్రితం నంది హీల్స్ లోని తన ఇంట్లో మనీషా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఇంట్లో అపస్మార్క స్థితిలో పడిపోయి ఉన్న మనీషాను చూసిన కుటుంబ సభ్యులు వెంటనే నాపంల్లిలోని కేర్ హాస్పిటల్‌కు తరలించారు.

వేద న్యూస్

ఆదివారం ఆగస్టు 03, 2025

# సంపాదకీయం

బేడీల వలతో ఎన్నాళ్లు ఏలుతరు?

‘తెలంగాణ పరిరక్షణ పోరులో మరింత పదునెక్కి పోరాడుదాం’ అని ఇటీవల మహా న్యూస్ వివాదం నేపథ్యంలో, అక్రమ కేసులతో ఇరువై రోజులు చంచల్‌గూడ జైల్లో గడిపి బయటికొచ్చిన సందర్భంగా విద్యార్థి నేతలు భావోద్వేగంతో పునరుద్ఘాటించారు. నిజానికి వారి మాటలను సర్కార్ పెద్దలు విని ఉంటే, ఆ క్షణం నుంచే వాళ్లు దగ్గర పెట్టుకొని ప్రభుత్వ పనితీరును సరిచేసుకునేవారు. అసలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలకు హృదయముండనే ఉండదనే వాస్తవానికి చరిత్రనే రుజువు. కానీ, కనీసం వినికిడి సామర్థ్యం సైతం శూన్యమనే సత్యాన్ని రేవంత్ సర్కార్ తేటతెల్లం చేసింది. దానివల్లనే ఎఫ్ఐఆర్‌లు, అరెస్టులు, రిమాండ్‌ల కోసం ప్రభుత్వం పరితపిస్తూనే ఉన్నది. పోలీస్‌స్టేషన్‌లను ఔట్ పోస్టులుగా మలుచుకొని తెలంగాణ వ్యతిరేక సర్కార్‌ను సంరక్షించుకోవడం సాధ్యపడదని విజయ తెలంగాణ నేపథ్యమే నిరూపిస్తున్నది కదా? మరెందుకు రేవంత్ సర్కార్ అలాంటి విఫల నమూనాను అనుసరిస్తున్నది? ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, లగచర్ల నుంచి సెంట్రల్ వర్సిటీ వరకు నలుమూలలనూ బేడీల భూతంతో భయపెట్టాలనే, పారని పాలనా మంత్రాన్నే పదే పదే విచిత్రంగా ప్రయోగిస్తున్నది.

అవన్నీ హింసిం చే రాజు ఇరవై మూడవ రాజు పులకేశి సినిమాలోలా హాస్యాస్పదంగా మారిపోయాయి. పదిహేడవ శతాబ్దంలో చోళపురం పాలయం రాజైన, మహా మూరు?డు పులకేశి, బ్రిటిష్ వారికి తొత్తుగా మారి ఆ రాజ్య ప్రజలను నానావిధాలా హింసించాడు. చివరికి వివిధ కులాలు కొట్టుకోవడానికి ప్రత్యేక స్టేడియాలను సహితం నిర్మించిన పులకేశి, చరిత్రలో విధ్వంసక చక్రవర్తిగా ఘనతకెక్కాడు. విభజించి, చొరబడి, చెరబట్టాలనే బ్రిటిషర్ల కుట్రలను తు.చ. తప్పక అమలుచేసిన అమానవీయ రాజు ఆనాటి పులకేశి. మరి నేడు మన రాష్ట్రంలో కూడా వివాదాలు, కట్టు కథలు, కేసులు ఇలా ఎన్నో మాయోపాయాల మంత్రదండాన్ని సర్కార్ నమ్ముకొని నడక సాగిస్తున్నది కదా?.

విద్యార్థులను జైలుకు పంపిన మహా న్యూస్ వంటి వివాదం ఒకవేళ తమిళనాడులోనో, మహారాష్ట్రలోనో జరిగి ఉంటే నిరసన కాదు, నిప్పుల తుపాన్ పుట్టేది. ఆయా రాష్ట్రాల ఆత్మగౌరవమే ఆశయంగా పోరాడే స్టాలిన్ మీదో, ఠాక్రేల పైనో తంబ్‌నెయిల్స్‌తో అక్కడి ఏ మకిలి మీడియా అయినా తెగబడి ఉంటే ఏం జరిగి ఉండేదో వివరించనక్కర్లేదు కదా?. నాయకత్వాన్ని దూరం చేస్తే తప్ప వనరులపై అజమాయిషీ అసాధ్యమనే దుర్బుద్ధితో పాటు, పైచేయి సాధించిన తెలంగాణను తిరిగి పాతాళానికి చేర్చాలనే చంద్రబాబు నాయుడి వ్యూహాత్మక ఎత్తుగడే మీడియా ముసుగులో దాడిగా మారింది. పదేండ్ల స్వయం పాలనలో ఆదాయ గోపురంలా పునర్నిర్మాణమైన తెలంగాణను కొల్లగొట్టడానికి అడ్డుపడే నాయకత్వాన్ని, రాజకీయంగా మట్టుబెట్టడానికి వికృత ఎత్తుగడలకు ఒడిగడుతున్నాడు. అయితే ఇది తెలంగాణలో అమలవుతున్న సరికొత్త సర్కార్ ఫార్ములా ఏం కాదు. వాస్తవానికి పోరులోనే పరవశించింది తెలంగాణ. ప్రజారాశుల శత్రువు పన్నే వ్యూహాల గురించి దశాబ్దాల కిందటే మాటల్లో, పాటల్లో విశ్లేషించుకున్నది. ‘నాలుకలపై పూసే తీపంతా తేనె కాదు, చెవుల్లో వొంపే కథంతా కుట్రాతీతం కానే కాదు. ఏమరుపాటుతో ప్రతి కట్టుకథకూ తలలూపితే, సర్వస్వం తాకట్టు ఖాయమనే వాస్తవం అనుభవపూర్వకంగా తెలంగాణకు తెలుసు. అయితే వినపడేది మాత్రమే కాదు, కనపడేదంతా కూడా నిజం కాదనేది పెట్టుబడిదారీ రాజకీయాలకు పేటెంట్ అయిన చంద్రబాబు నాయుడు లాంటి పాలకుల వల్ల ఏనాడో తేటతెల్లమైంది. ఉమ్మడి రాష్ట్ర కాలంలోనే కాదు కాస్త వెనక్కి మళ్ళీ ప్రపంచ చరిత్రను పరిశీలించినా, అస్తిత్వ రాజకీయ శక్తుల వ్యక్తిత్వ హననానికి దోపిడిదారులు ఎంత విషం పారించారో, ఎంతెంత నెత్తురు తాగారో తేలిగ్గానే అర్థమవుతుంది. మన అనుభవమైన, చరిత్రైన స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని అస్థిరపరచడం వెనుక ఏ రాజకీయ, అసాంఘిక శక్తుల ప్రయోజనాలు దాగి ఉంటాయోనన్నది కండ్ల ముందుంచుతున్నది. అందుకే, ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ పరివారంపై, పార్టీపై సాగుతున్న విష ప్రచారాన్ని లోతుగా అందరం అర్థం చేసుకోవాలి. అవినీతి నుంచి మొదలుపెట్టి విలీనం వరకు నిత్యం వండి వారుస్తున్న వార్తల వెనుక మర్మాన్ని స్పష్టంగా చూడగలగాలి. నిధులు, నదులు ఎత్తుకెళ్లే ఎత్తుగడలతో ఎలా పావులు కదుపుతున్నారో నగ్నంగా కనపడిపోతూనే ఉన్నది కదా?

ఈ కుయుక్తులిలా సాగుతుంటే, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో డ్రామాలకు, పాదయాత్రల పేరిట పల్లెల్లో పగటివేషాలకు హస్తం పార్టీ తెగబడుతున్నది. వీటన్నింటినీ తెలంగాణ హృదయంతో జాగ్రత్తగా చూడక, పైపై చూపులతో ఎవ్వరమూ సరిపెట్టుకోరాదు. రేవంత్‌ను నమ్ముకొని అమరావతి, మీనాక్షిని ముందుపెట్టి హస్తిన మొత్తం తెలంగాణ అస్తిత్వాన్ని పలుచన చేసే రాజకీయాలు నడిపిస్తున్నారు. విద్యార్థులు, యువత, బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, రైతులు ఇలా అన్నివర్గాలకు ద్రోహం తలపెట్టడమే కాదు, తెలంగాణ తలనూ తాకట్టు పెట్టేస్తున్నారు. దానికోసమే తెలంగాణలో బిగిసిన ప్రతి పిడికిలికీ బేడీలు వేసేస్తున్నారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్ అరెస్టు చేసిన ప్రతి ఉద్యమకారుడు కూడా ‘కంసుని చెరలోని కన్నయ్య’ మాదిరిగా పెరిగి అరాచక ప్రభుత్వ పతనానికి అంతిమ తీర్పును రాయడం ఖాయం. బేడీల వల విసిరి తెలంగాణను లొంగదీసుకోగలమని కలగనడం వారి మూర?త్వానికి నిలువుటద్దం. ఈ వికృత వ్యూహాలతో తెలంగాణను ఎన్నాళ్ళేలగలరు.

# కలెక్టర్‌తో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధుల మీటింగ్

**వేద న్యూస్, వరంగల్:**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రజలు, యువత సభ్యత్వం పొందాలని, మానవ సేవ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుల వారి ఆదేశాల మేరకు వరంగల్ జిల్లావ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ బ్రాంచ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మానవత్వానికి ప్రతీక అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో సభ్యత్వం పొందడం గౌరవించదగిన విషయం అని చెప్పారు. ప్రజాసేవలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాల్లో భాగ్యస్వాములు కావాలన్నారు. ప్రకృతి విపత్తులు, రక్తదానం, ఆరోగ్య శిబిరాలు, ఎమర్జెన్సీ సేవల వంటి రంగాలలో రెడ్ క్రాస్ సేవలు అందిస్తుందన్నారు. దీనిపై అవగాహన కల్పించి పాఠశాలలు, కళాశాలలలో ఎన్ ఎస్ ఎస్, ఎన్సిసిల మాదిరిగా జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కమిటీలను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా సహకార అధికారి నీరజ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఐఆర్ఎస్ ఎంసీ మెంబర్ నాడెం శాంతికుమార్, కోశాధికారి రాజేశ్వర్ ప్రసాదద్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ రిజర్వేషన్‌లు తగ్గించేందుకు కాంగ్రెస్ కుట్ర





**వేదన్యూస్ డెస్క్:**

కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.

ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించారని ఆరోపించారు. ఇవాళ(శనివారం ఆగస్టు 2) ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా నిర్వహించింది. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ నేతలు ఎండగట్టారు. బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు , బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గతంలో అమలైన 35 శాతం కంటే కూడా రెండు శాతం రిజర్వేషన్లు తగ్గించేలా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. 20శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలో జనాభా పెరిగిందని బీసీల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారని తెలిపారు. 42 శాతం పూర్తిగా బీసీలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీల మెడలు కోసేలా ముస్లింలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేసిన పార్టీ బీజేపీ మాత్రమేనని ఉద్ఘాటించారు. గత 70 ఏళ్లలో కుల గణన ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కులగణన చేయని కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ పార్లమెంట్ ముందు ముక్కు నేలకు రాయాలని విమర్శించారు కిషన్‌రెడ్డి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విషయంలో మార్పు వచ్చిందో సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి నిలదీశారు. రాష్ట్రంలో ముస్లింలకు అమలవుతున్న 4శాతం రిజర్వేషన్‌లు తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కింద ముస్లిం, క్రిస్టియన్‌లకు రిజర్వేషన్‌లు కల్పిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ విషయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ ఏ విషయం లో ఆదర్శమో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాయలో మనం పడకూడదని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బీసీ సంఘాలు పోరాటం చేయాలని కోరారు. బీసీలకు బీజేపీ అండగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి

**వేదన్యూస్ డెస్క్:**

కరోనా ప్రజల జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆరోగ్యం పట్ల క్రమశిక్షణ ఉండాలని కరోనా ప్రపంచానికి నేర్పించిందని తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో జరిగిన మహిళా యోగా పోటీల కార్యక్రమానికి హరీశ్‌రావు ముఖ్యమంత్రిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే నాలుగు కాలేజీలు, నాలుగు రోడ్లు, నాలుగు స్టేడియాలు కట్టడం కాదని.. ప్రజల జీవన ప్రమాణాలు మారాలని అన్నారు. ఆరోగ్య సిద్ధిపేటే..అభివృద్ధి సిద్ధిపేట అని వ్యాఖ్యానించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అది అభివృద్ధి అని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం కూడా అభివృద్ధిలో భాగమవ్వాలని కోరారు. ఆరోగ్యమే మహా భాగ్యమని పెద్దలు అన్నారని.. లక్షలు ఖర్చుపెట్టి హాస్పిటల్లో నయం చేసుకునే కన్నా స్వీయ క్రమశిక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

పిల్లలు ఫిజికల్ గేమ్స్ ఆడటం మానేసి.. ఆన్‌లైన్ గేమ్స్ మొదలు పెట్టారని హరీశ్‌రావు అన్నారు. ఇవ్వాళ తల్లులు కూడా పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇస్తున్నారని.. పిల్లలకు అన్నం తినిపించడం ఈజీ అయ్యింది కానీ అది మంచిది కాదని హితవుపలికారు. యోగా మనలో మానసిక ఒత్తిడిని దూరం చేస్తుందని అన్నారు. యోగా చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని, మన శరీరాన్ని బాగా ఉంచుకోవచ్చని తెలిపారు. మంచం మీద పడ్డాక ఎంత బాధపడ్డా ఏం రాదని అన్నారు. అందుకే తప్పకుండా అందరూ యోగా చేయడం నేర్చుకోవాలని సూచించారు. ప్రతిరోజూ అవుట్ డోర్స్ గేమ్స్ ఆడాలన్నారు. జంక్ ఫుడ్ తినవద్దని సూచించారు. మితమైన ఆహారంతోనే అమితమైన ఆరోగ్యమని అన్నారు. యోగా, గేమ్స్ వల్ల ఓటమిని జీర్ణించుకునే శక్తి వస్తుందని చెప్పారు. జీవితంలో ఒడిదొడుకులు నేర్చుకుంటారని అన్నారు. సిద్ధిపేట ఈ రోజు జాతీయ స్థాయిలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు.




# థియేటర్లలో బాణాసంచా కాలిస్తే కేసులు

**వేదన్యూస్ డెస్క్:**

ఆర్టీసీ క్రాస్ రోడ్ సినిమా థియేటర్ల ఆవరణల్లో బాణాసంచా కాలిస్తే పోలీసు కేసులు పెడతామని మేనేజ్‌మెంట్లు హెచ్చరించాయి. ఈ మేరకు ఆయా థియేటర్‌ల ఆవరణల్లో వాల్‌పోస్టర్లు, బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. గతేడాది డిసెంబర్ 4వ తేదీన రాత్రి ఓ సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన దుస్సంఘటన నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని అన్ని సినిమా థియేటర్ల యాజమాన్యాలు జాగ్రత్తలు, చర్యలు తీసుకుంటున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల సందర్భంగా అభిమానులు బాణాసంచా కాలుస్తుండగా ఎన్టీఆర్ భారీ కటౌట్ కాలి బూడిదైన విషయం విదితమే. కొత్త సినిమాలు, ప్రముఖ హీరోలు నటించిన సినిమాలు విడుదల సందర్భంగా ప్రీమియర్ షోల సమయాల్లో తప్పనిసరిగా టికెట్లు ఉన్న ప్రేక్షకులను మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ప్రముఖ హీరో పవన్‌కల్యాణ్ సినిమా హరిహరవీరమల్లు సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో ఎలాంటి అర్భాటాలు లేకుండా బాణాసంచా కాల్చే సంఘటనలు జరగకుండా 80 మంది పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. కాగా గురువారం విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ సినిమా విడుదల సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మనుమడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు హిమాన్షురావు కల్వకుంట్ల తన స్నేహితులతో సినిమా చూడ్డానికి వచ్చారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073